# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 08 శనివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 200

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ

## నామినేటెడ్ పోస్టుల భర్తీపైన కసరత్తు

**హైదరాబాద్:** ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ.. పీసీసీ కొత్త కార్యవర్గం.. నామినేటెడ్ పోస్టుల భర్తీ పైన హైకమాండ్ కసరత్తు చేస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు.. కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో హైకమాండ్ అలర్ట్ అయింది. దీంతో, పదవుల విషయంలో కీలక నిర్ణయానికి సిద్దమైంది. మంత్రి పదవుల ఖరారు పైన కొత్త ఫార్ములా అమలు చేస్తోంది. అందులో భాగంగా పార్టీ నేతలకు కీలక సూచనలు చేసింది. హైకమాండ్ తో చర్చలు ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ ముఖ్యులతో కలిసి ఢిల్లీ వెళ్లారు. పార్టీ నేత కేసీ వేణుగోపాల్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. కుల గణన పైన నివేదికను సమర్పించారు. కాగా, మంత్రివర్గ విస్తరణ.. పీసీసీ కార్యవర్గంతో పాటుగా నామినేటెడ్ పదవుల పైన చర్చ చేసారు. దీంతో, హైకమాండ్ తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల పైన ఆరా తీసినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు.. హామీల అమలు గురించి చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో మంత్రివర్గం విస్తరణ కోసం ఆశావాహులు చాలా కాలంగా నిరీక్షిస్తున్న విష యం పైన చర్చ జరిగింది. మోక్ష జ్ఞ సరసన మెగా హీరోయిన్ ఖరారు? ప్రతిపాదనలు సిద్దం పార్టీ ముఖ్య నేతలు చర్చించి.. తమకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరినట్లు పార్టీ నేతలు చెబు తున్నారు. సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తో పాటుగా పార్టీ ఇంఛార్జ్ సైతం ఢిల్లీలోనే ఉన్నారు. సామాజిక - ప్రాంతీయ సమీకరణాలతో కూర్పు దిశగా కసరత్తు జరుగుతోంది. రేవంత్ రెడ్డి క్యాబినేట్ లో ముస్లిమ్ మైనారిటీ వర్గం నుంచి ఎవరు ఆమాత్యులుగా లేరు. ఈ సారి మంత్రివర్గంలో మైనారిటీ వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి దక్ ఛాన్స్ కనిపిస్తోంది. అదే విధంగా ఎస్సీ ల నుంచి మాల, మరో రెడ్డితో పాటు ఒక బీసీలకు దక్కే అవకాశాలు ఉన్నాయి.

# నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిన రేవంత్



**దేశానికి వెన్నెముకలాంటి రైతుకే భరోసా కరువు**

**పార్టీ ఫిరాయింపులపై సుప్రీం మొట్టికాయలు**

**తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం**

**విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్**

**హైదరాబాద్:** నమ్మినందుకు ప్రజలను, రైతులను తెలంగాణ ప్రభుత్వం నట్టేట ముంచిందని, ఇప్పటి వరకు 420 మంది రైతన్నల బలవన్మరణం చేసుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశానికే వెన్నుముకైన రైతులకు... కుటిల కాంగ్రెస్ పాలనలో వరుస వెన్ను పోట్లు పొడుస్తున్నారని, ఓట్లనాడిచ్చిన హామీలకు లెక్కలేనన్ని తూట్లు పొడుస్తు న్నారని దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి తెలంగాణను తీసుకువస్తే.. ఇప్పుడు పెట్టుబడికి పత్తాలేదు.. దిగుబడికి దిక్కులేదంటూ ఆయన విమర్శించారు. రుణమాఫీని ఆగంచేసి.. పెట్టుబడి సాయానికి

మిగతా 2లో




## ప్రధాని మోదీతో హీరో నాగార్జున కుటుంబం భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో టాలీవుడ్ హీరో అక్కినేని నాగర్జున ఫ్యామిలీ భేటీ అయింది. కుటుంబ సమేతంగా ప్రధాని మోడీని కలిసేందుకు అక్కినేని నాగార్జున, అమల, చైతన్య, శోభిత ధూళిపాళ్ల పార్లమెంటుకు వెళ్లారు. కాగా, హీరో నాగార్జున గతంలో పలుమార్లు ప్రధాని మోదీని కలిశారు. ఇటీవల టాలీవుడ్ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావుపై నరేంద్ర మోదీ ప్రశంసలు కూడా కురిపించారు. భారతీయ సినిమాకు నాగేశ్వరరావు చేసిన కృషిని 'మన్ కీ బాత్' కార్యక్రమంలో

మిగతా 2లో

## మహా కుంభమేళా @ 40 కోట్లు

మహాకుంభ్ నగర్ (యూపీ): ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీసంగమం వద్ద జనవరి 13 నుంచి కొనసాగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసిన భక్తుల సంఖ్య శుక్రవారం నాటికి 40 కోట్లు దాటినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం 48 లక్షల మంది భక్తులు విచ్చేయగా.. అత్యధికంగా మకర సంక్రాంతికి 3.5 కోట్లు, మౌనీ అమావాస్యకు 8 కోట్లు, వసంత పంచమి వేళ 2.57 కోట్లమంది అమృత స్నానాలు చేసినట్లు వివరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు రాజకీయ, సినీరంగ ప్రముఖులు ఇప్పటికే కుంభమేళాను సందర్శించి పూజాదికాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10వ తేదీన (సోమవారం) త్రివేణీసంగమానికి విచ్చేయనున్నట్లు రాష్ట్ర సర్కారు వెల్లడించింది.



## 50% ఇళ్లలో కులగణనే చేయలేదు

**కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీరు విచారకరంగా ఉందని, దాదాపు 50% ఇళ్లలో అసలు కులగణనే చేపట్టలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు.**



దిల్లీ: కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీరు విచారకరంగా ఉందని, దాదాపు 50% ఇళ్లలో అసలు కులగణనే చేపట్టలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం దిల్లీలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... "చాలా బీసీ సంఘాలు కులగణనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ముస్లిం బీసీ, హిందూ బీసీ అని ఏ చట్టంలో ఉందో ప్రభుత్వం చెప్పాలి. ముస్లింల ప్రాపకం కోసం రాహుల్‌గాంధీ నేతృత్వంలో బీసీలకు అన్యాయం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రపన్నింది. కులగణనపై బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించడం విడ్డూరంగా ఉంది. ముస్లింలను బీసీల్లో కలిపి బీసీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం చేయాలని చూడటాన్ని భాజపా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది" అని స్పష్టంచేశారు.

విద్యుత్తు సంస్థల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు

"ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం బొగ్గు, గనుల రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. 2014లో విద్యుదుత్పత్తి సంస్థల వద్ద నాలుగు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉండే. ఇప్పుడు మోదీ సంస్కరణల కారణంగా 21 రోజులకు సరిపడా నిల్వలు ఉంటున్నారు. 2023-24లో 998 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. ప్రధాని ఆలోచనలకు అనుగుణంగా బొగ్గు దిగుమతులు తగ్గడంతో దాదాపు రూ.30 వేల కోట్ల విదేశీ మారకం ఆదా అయింది" అని కిషన్‌రెడ్డి వివరించారు.





కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం




షాపు కూల్చివేతపై మహిళ ఆందోళన పెట్రోల్ బాటిల్‌తో రోడ్డుపై బైఠాయింపు

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట




**ఆందోళన కలిగిస్తున్న వరుసగా ఫుడ్‌పాయిజన్ కేసులు : మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు**

# నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిన రేవంత్

పాతరేసి.. ముంచేరోజులు తేవడంవల్లే ఈ అనర్థాలని కేటీఆర్ అన్నారు. చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్లే.. మళ్లీ తెలంగాణ పల్లె కన్నీరుపెడుతోందన్నారు. మళ్లీ మరణమృదంగం మోగుతోందని.. ఈ ప్రభుత్వానికి చేతనైతే.. ఇకనైనా సాగు సంక్షోభాన్ని తీర్చాలని.. అన్నదాతల ఆత్మహత్యల పరంపరను ఆపాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పదని, తెలంగాణలో ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. గురువారం పార్లమెంట్ ఎదుట విజయ్ చౌక్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఇటీవలే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని, వారికి నోటీసులు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడేలా సుప్రీంకోర్టులో కొట్లాడతామన్నారు. అంతకుముందు ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సమావేశమైంది. సిరిసిల్ల వరకు నిర్మాణమవుతున్న జాతీయ రహదారి 365–బీని వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని గడ్కరీని కోరామన్నారు. మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారి 63ని దానితో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్లకు అప్పగించడం సరికాదన్నారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిబంధనలు తెస్తే సహించేది లేదన్నారు. యూజీసీ నిబంధనల్లో మార్పులపై బీఆర్ఎస్ నేతృత్వంలోని ఆరు పేజీలతో కూడిన విద్యారంగ నిపుణుల సలహాలు, సూచనలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేటీఆర్ అందజేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి హక్కులకు భంగం వాటిల్లకుండా యూజీసీ నూతన నిబంధనలు రూపొందించాలని కేటీఆర్ కోరారు. కేంద్రమంత్రులను కలిసిన బీఆర్ఎస్ బృందంలో ఎంపీలు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సంజయ్ కుమార్ తదితరులున్నారు. రాష్ట్ర సచివాలయంలోనే కాక గ్రామ సచివాలయాల్లో కూడా పాలన పడకేసిందని, ప్రజల కష్టాలు తీరేదెలాగంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన పల్లె ప్రజలకు కష్టాలు తెచ్చిందన్నారు. సీఎం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని, గ్రామాల్లో సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

**ఆందోళన కలిగిస్తున్న వరుసగా ఫుడ్‌పాయిజన్ కేసులు : మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు**

హైదరాబాద్: గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో నమోదయ్యాయని అన్నారు.వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు.అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప కూడా దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమని అన్నారు. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## ప్రధాని మోదీతో హీరో నాగార్జున కుటుంబం భేటీ

ప్రధాని నరేంద్ర కొనియాడారు. మోదీ చేసిన వ్యాఖ్యలకు హీరో నాగార్జున సోషల్ మీడియా వేదికగా స్పందించి ధన్యవాదాలు తెలిపారు.ఇదిలా ఉంటే.. అక్కినేని నాగ చైతన్య హీరోగా నటించిన చిత్రం 'తండేల్' నేడు విడుదల అయింది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వస్తోంది. హీరో నాగ చైతన్యను ఇప్పటి వరకు లవర్ బాయ్‌గానే చూసిన అక్కినేని అభిమానులకు తనలోని మరో యాంగిల్‌ను చూపించారు నాగ చైతన్య . పాకిస్థాన్‌లో దొరికిపోయిన జాలరిగా విభిన్న పాత్రల్లో నాగ చైతన్య నటించి అందరిని మెప్పించారు. చందు మొండేటి దర్శకత్వం వహించిన 'తండేల్' సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించింది.

# కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం


**న్యూఢిల్లీ:**మహా కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. కుంభమేళాలో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంలో ఇలాంటి ఘటనలు టెన్షన్ కలిగిస్తున్నాయి. మౌని అమావాస్య సందర్భంగా జనవరి 29వ తేదీన కుంభమేళాలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ ఘటనలో 30కి పైగా మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 60 మంది గాయపడ్డారని సమాచారం. తాజాగా శంకరాచార్య మార్గంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుంభమేళా మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం ఇది నాలుగోసారి. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాల కోసం కోట్లలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో నెటిజన్స్ కోరుతున్నారు.

# మహాశివరాత్రికి శ్రీశైలం ముస్తాబు

హైదరాబాద్: మహాశివరాత్రికి శ్రీశైలం అవుతోంది. ప్రతీ ఏటా శివరాత్రి వేళ శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సైతం ఈ మేరకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. పెద్ద సంఖ్య లో భక్తులు తరలి వస్తారనే అంచనాలతో ఏర్పాట్ల పైన అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి మార్చి1 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇక, తెలంగాణ టూరిజం శ్రీశైలం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేస్తోంది. ఈ నెల 26న మహా శివరాత్రి. ప్రముఖ క్షేత్ర శ్రీశైలంలో ఈ నెల 19 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి తరలి రానున్నారు. దీంతో, భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక.. తెలంగాణ టూరిజం శాఖ తాజాగా శ్రీశైలం వంటి ప్రాంతాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. రెండు రోజుల పాటు సాగే యాత్ర కోసం పెద్దలకు రూ 2,999 తో, అదే విధంగా పెద్దలకు రూ 2,392 విలువ చేసే ప్యాకేజీలను వెల్లడించింది. శ్రీశైలం యాత్ర ప్రత్యేకంగా రెండు బస్సులను కేటాయించారు. వాటిలో ఒక ఏసీ బస్సు కూడా ఉంది. నాన్–ఏసీ బస్సు ప్యాకేజీ ధరలను ప్రకటించారు. నాన్ ఏసీలో పెద్దలకు రూ 2 వేలు, పిల్లలకు రూ 1,600 గా ఖరారు చేసారు. రెండు రోజులు వసతి సౌకర్యం కల్పించారు. ఉదయం 8:30 గంటలకు టూరిస్ట్ భవన్ నుండి ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. టూర్ లో భాగంగా మధ్యలో సాక్షి గణపతి ఆలయాన్ని సందర్శించవచ్చు. వారిని నేరుగా హొటల్‌కు తీసుకెళ్తారు. శ్రీశైల దర్శనం రెండవ రోజు సాయంత్రం లేదా తెల్లవారుజామున చేసుకునే విధంగా ప్లాన్ చేసారు. రోప్‌వే (పాతాళ–గంగా), ఫలధార, పంచధార, శిఖర, చివరకు ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఆనకట్టను సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం ఉంటుంది.

# షాపు కూల్చివేతపై మహిళ ఆందోళన

**పెట్రోల్ బాటిల్‌తో రోడ్డుపై బైఠాయింపు**



**హైదరాబాద్:** కల్యాణపురి వద్ద గత 20 ఏళ్లుగా ఆ మహిళ పాల కేంద్రాన్ని నడుపుతోంది. అయితే తమ షాపును జీహెచ్ఎంసీ అధికారులు అక్రమంగా కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేస్తోంది. పెట్రోల్ బాటిల్ పట్టుకుని జీహెచ్ఎంసీ వాహనాల ముందు బైఠాయించి నిరసన తెలిపింది. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన పాల కేంద్రాన్ని కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది. మరో వైపు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు.

# మస్తాన్ సాయి డ్రగ్స్ కేసులో రంగంలోకి నార్కోటిక్స్ పోలీసులు

**హైదరాబాద్:** విచ్చలవిడిగా డ్రగ్స్ వీడియోలు వైరల్‌గా మారడంతో నార్కోటిక్స్ పోలీసులు రంగంలోకి దిగారు. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో డ్రగ్స్ వాడకం వీడియోలు భారీగా లభించింది. దీంతో డ్రగ్స్ తీసుకున్న వారి వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరిస్తున్నారు. గతంలోనూ మస్తాన్ సాయి, లావణ్యపై డ్రగ్స్ కేసులు ఉన్నాయి. తాజాగా వీరితో పాటు పార్టీల్లో పాల్గొన్న వారి వివరాలను సేకరిస్తున్నా నార్కోటిక్స్ పోలీసులు. ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నారు, ఎక్కడ పార్టీలు నిర్వహిస్తున్నారు, ఎంత మంది పాల్గొన్నారు అనే అంశాలపై ఫొకస్ పెట్టారు. ఇప్పటికే గుంటూరులో రాహుల్ అనే వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. మస్తాన్ సాయి డ్రగ్ పార్టీ వీడియోలో ఉన్న వారందరూ పరారయ్యారు. మస్తాన్ సాయి కేసులో నార్కోటిక్ పోలీసులు నిఘా పెంచారు. నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయిని అరెస్ట్ చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యువతులను ట్రాప్ చేసి వారి నగ్న వీడియోలు చిత్రీకరించిన తర్వాత వాళ్లను బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడంటూ లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు పోలీసులు. అయితే ఈ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. మస్తాన్ సాయి ఇంట్లో జరిగిన పార్టీలకు సంబంధించిన వీడియోలో బయటకు వచ్చాయి. అందులో చాలా మంది యువతీ యువకులు పార్టీలో డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో నార్కోటిక్ పోలీసులు డ్రగ్స్ వ్యహారంపై రంగంలోకి దిగారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాలో నార్కోటిక్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మస్తాన్ సాయి స్నేహితుడు రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ పార్టీలో ఉన్న ఎనిమిది మంది అమ్మాయిలు, పది మంది అబ్బాయిల వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరించే పనిలో పడ్డారు. వారాంతంలో మస్తాన్ సాయి



ఇంట్లోనే డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవాడు. అయితే వీడియోలు బహిర్గతం అవడంతో అందులో ఉన్న వారు పరారీలో ఉన్నారు. వారి మొబైల్స్‌ను స్విచ్ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఏడు నుంచి ఎనిమిది సార్ల వరకు జరిగిన డ్రగ్స్ పార్టీల వీడియోలు బయటకు వచ్చాయి. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు మస్తాన్ సాయిని కస్టడీకి కోరుతూ నార్సింగి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు మధ్యాహ్నం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది. మస్తాన్ సాయిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు.

## మళ్లీ దూకుడుపెంచిన హైడ్రా

**హైదరాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తోన్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అలాగే కూకట్ పల్లి నిజాంపేట మెయిన్ రోడ్డులో.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను జేసీబీలతో హైడ్రా అధికారులు కూల్చివేశారు. నిజాంపేట హోలిస్టిక్ ఆస్పత్రి వెనక భాగంలో ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టుపక్కల వాళు పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టారు. ప్రహరీగోడలు కట్టేశారు. కొన్నేళ్లుగా ఈ విషయంపై ఆర్మీ ఉద్యోగి పోరాటం చేస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. ఈ క్రమంలో ఆర్మీ ఉద్యోగి ఆధారాలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు.. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని నిర్ధారించి.. గురువారం జేసీబీలతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఆర్మీ ఉద్యోగికి స్థలాన్ని అప్పగించారు.

## వరుసగా రెండురోజులు స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్:** వరుసగా రెండు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రానున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు జనవరిలో భారీగా సెలవులు వచ్చాయి. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సెలవులు దొరకడంతో విద్యార్థులు సందడిగా గడిపారు. అయితే వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో ప్రిపరేషన్‌తో బిజీ అయిపోయారు స్టూడెంట్స్. అయితే ఫిబ్రవరిలో మరో రెండు రోజుల పాటు సెలవులు రానున్నాయి. ఇప్పటికే నాలుగు ఆదివారాలు రాగా మరో రెండు రోజులు కూడా సెలవు దొరకనున్నాయి. 4 ఆదివారాలతో పాటు శివరాత్రి పండుగ కూడా ఈ నెలలోనే వచ్చింది. వీటికి తోడు అదనంగా మరో రోజు కూడా సెలవు దొరకనుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఆయా స్థానాలకు నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. ఇందుకుగానూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్‌తో పాటు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ దృష్ట్యా పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, స్కూల్ టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు ప్రభుత్వాలు సెలవు ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఈ నెల 27న కూడా సెలవు మంజూరు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న శివరాత్రి పండుగ రావడంతో ఆ రోజు పబ్లిక్ హాలీడే ఇస్తారు. దీంతో ఈ నెలలో ఆదివారాలతో పాటు మరో రెండు రోజుల సెలవులు కలిపి మొత్తం ఆరో రోజుల పాటు విద్యార్థులకు సెలవులు వచ్చినట్లు అవుతుంది. తెలంగాణతో పాటు ఏపీలో శివరాత్రి పర్వదినం తర్వాత రెండు రాష్ట్రాల్లో ఒకేరోజు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు వరంగల్–ఖమ్మం–నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు
ఎన్నికలు నిర్వహిస్తారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ స్థానాలకు ఎన్నిక జరగనుంది. అలాగే విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం స్థానాల్లోనూ ఎలక్షన్స్ నిర్వహిస్తారు.

## నీతి ఆయోగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. భేటీ కోసం శుక్రవారం ఉదయం సచివాలయానికి చేరుకుంది నీతి ఆయోగ్ బృందం. ఈ సందర్భంగా సుమన్ బేరీ నేతృత్వంలోని నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులతో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ భేటీ అవనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వికసిత్ ఏపీ - 2047 విజన్ డాక్యుమెంట్‌పై చర్చించనున్నారు. ఏపీలో అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భేటీలో చంద్రబాబు, పయ్యావుల చర్చించనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే 16వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పనగారియాను సీఎం చంద్రబాబు, పయ్యావుల కలిసిన విషయం తెలిసిందే. నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంలో కీలక బృందం ఈరోజు ఏపీకి వచ్చారు. ఏ.ముత్తు కుమార్ ఐఏఎస్, పార్థసారథి రెడ్డి ఐఏఎస్. కె. కిషోర్ భేటీలో పాల్గొన్నారు. అలాగే నీతిఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ ఈ భేటీకి ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వికసిత్ ఏపీ- 2047 విజన్ డాక్యుమెంట్‌పై ప్రధానంగా చర్చించనున్నారు. ఏపీకి ఉన్న అప్పులు వాటితో పాటు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమావేశంలో చర్చ జరుగనుంది. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితిని వారికి వివరించనున్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్‌ను కూడా కలిసిన నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రప్పించుకోవడంతో పాటు పన్నుల్లో వాటా, వివిధ కేంద్ర ప్రయోజిత పథకాల్లో రావాల్సిన వాటాలపైన రాష్ట్రం తీసుకుంటున్న చర్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై వీరి భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# ఇంకెన్నాళ్లీ తిరోగమన చర్యలు

ఏటా స్వాతంత్ర్య సాధించి దాదాపు 78 ఏళ్లు కావస్తున్నా సామాన్యుల జీవితాల్లో మార్పు గురించి మాత్రం ఆలోచించడం లేదు. ఉచిత పథకాలు, తాయిలాలు, ఉచిత బియ్యం, రూపాయికే కిలో బియ్యం, పెన్షన్లు ఇవే అభివృద్ధి, ఇవే పాలన అన్న తీరుగా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయి. పేదవారి పేరు చెప్పి పథకాల పేరుతో పందేరాలు చేస్తున్నారు. తమ అధికారం నిలుపుకోవడమెలా అన్న కోణంలోనే పథకాలు, పందేరాలు సాగిస్తూ పాలన చేస్తున్నారు. అందుకే దేశం అధిక జనాభాకు తోడు అనేకానేక సమస్యలను మోయాల్సి వస్తోంది. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బులతో నేతలు జల్సాలు చేస్తున్నారు. ఇంతకుమించిన అభివృద్ధి జరగడం లేదు. పేదలు ఇంకా పేదలుగానే మగ్గుతున్నారు. పేదల పేరు చెప్పి ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారన్నది ప్రజలు ప్రశ్నించడం నేర్చుకోవాలి. మనకు విదిలిస్తున్న డబ్బులతో అధికా పన్నులు ఏదో ఒక రూపంలో వసూలు చేయక తప్పదని కూడా గుర్తించాలి. ప్రజలు గుడ్డిగా నమ్మిన కారణంగా అభివృద్ధి అన్నది అడుగంటి పోఓతంది. అప్పులు చేసి దివాళా తీయిస్తున్నా..పరిష్కారం చూడడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత పాలకులు కెసిఆర్, జగన్‌లు రాష్ట్రాలను దివాళా తీయించారు. ఆ అప్పులకు వడ్డీలు కట్టలేక ఇప్పుడు ప్రజలు క్షోభ పడుతున్నారు. అబివృద్ధి ఆగిపోతోంది. ఇలాంటి సందర్భంగా అప్పలుపై చర్చ చేసి, అప్పులు చేయకుండా కట్టడి చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రాలు దివాళా తీస్తాయి. జీతాలు కూఅ ఇవ్వలేని దుస్థితి వస్తుంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడితే ప్రజలు బాగుపడతారని అనుకున్నారు. ఉద్యోగ ఉపాధి లభిస్తుందని అన్నారు. అయితే ఓ కుటుంబం రాజభోగాలు అనుభవించింది. వారి అనుయాయులు పదవులు దక్కించుకున్నారు. భూములు మాయం అయ్యాయి. 7లక్షల కోట్ల అప్పులు చూపారు. ఎపిలో జగన్ కుటుంబం రాజకీయ భోగాలు అనుభవించింది. రాష్ట్ర విభజన పాపం కారణంగా రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుని పోయి ఒకటి రెండు కుటుంబాలు బాగుపడ్డాయి. పదేళ్లుగా కేంద్రంలో మోడీ, అతని అనుయాయులు రాజ్యాధికారం అనుభవిస్తున్నారు. కరోనా తరవాత ప్రజల ఆర్థిక స్థితిగతులు అధ్వాన్నంగా మారినా పట్టింపు లేకుండా పోయింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ధరలు దాడి చేస్తున్నాయి. తిండిగింజలు కొనడం గగనంగా మారింది. పప్పులు, ఉప్పుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. చమురు ధరలు కారణంగా మరింతగా ధరలు దాడిఇ చేస్తున్నాయి. వివిధ రూపాల్లో పన్నులు పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. సామాన్యులు ఇల్లు కట్టుకునే భాగ్యం లేని పరిస్థితులు వచ్చాయి. ఇన్సూరెన్స్ చేసుకుందామనుకున్నా జిఎస్టీ కొరడాలు ఝళిపిస్తున్నారు. ఇవన్నీ చర్చించడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చర్చించగలిగేలా ఇవన్నీ ఉన్నాయి. కానీ తొలిరోజే రాష్ట్రపతి ప్రసంగాన్ని కాంగ్రెస్ బహిష్కరించింది. అమెరికా నుంచి అక్రమ వలసదారులను పంపితే యాగీ చేస్తున్నారు. ఏ దేశంలో అయినా ఇది సాధారణమే. మనం మాత్రమే మిన్నకున్నాం. ఉపాధి కోసం విదేశాలకు వెళుతున్నారంటేనే దేశంలో అవకాశాలు లేవని అర్థం. జిఎస్టీపై పార్లమెంటులో ప్రస్తావన వస్తే చర్చించలేని పెద్దలు పేదల గురించి, దేశం పురోగతి గురించి ఆలోచిస్తారంటే ఎలా నమ్మడం. వీరి చేతుల్లో ఉన్న పనులనే చేయడం లేదు. జిఎస్టీ ట్యాక్సులను తగ్గించలేని వారు, ఉపాధి కల్పనకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోలేని వారు వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన లేని వారు, నదీ జలాలలను సద్వినియోగం చేయాలనే పట్టుదల లేని వారు..దేశాన్ని అభివృద్ధి చేస్తామంటే నమ్మగలమా? దేశం అభివృద్ధి చెందాలంటే మానవ వనరులను ఉపయోగించుకోవాలి. వ్యవసాయిక దేశంగా ఉన్న మన దేశంలోని భూములను వినియోగంలోకి
తీసుకుని రావాలి. నీరు సముద్రం పాలు కాకుండా వాడుకోగలగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు తొలుత తగ్గించాలి. పెట్టుబడులు పెరగాలి. తయారీ, సేవలు, ఎగుమతుల తయారీ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం కోసం పరిశోధనలు చేయాలి. దేశ యువతకు ఉపాధి చూపించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ దిశగా మన ఆర్థిక విధానాలు వుండాలి. అప్పుడే తయారీ రంగంతో పాటు, మౌళిక రంగాలు అంటే రైల్వే, రోడ్లు, గృహ వసతి, నీటి పారుదల, విద్యుత్, విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడులుగా పెరుగుతాయి.
విపక్షాలుప్రజల సమస్యల కన్నా సొంత ఎజెండాతో పనిచేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే 2047 నాటికి మన దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుస్తామని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో డొల్లతనం తప్ప మరోటి కాదు. గత పదేళ్లుగా చేసిన, చేస్తున్న నిర్వాకంతో ప్రజలు బతికి బట్ట కట్టడమే భారంగా మారుతోంది. వికసిత భారత్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశం అంటే ప్రజలు తమంత తాముగా బతకగలగాలి. అందుకు అనువైన పరిస్థితులు కల్పించాలి. స్వయం ఉపాధి రంగాలు బలపడాలి. వ్యవసాయం బలోపేతం కావాలి. రైతులు ధీమాగా బతకగలగాలి. కానీ అలా జరగడం లేదు. దేశంలోని ప్రజల సగటు తలసరి ఆదాయాన్ని బట్టి అభివృద్ధి చెందిన, చెందుతున్న లేదా వెనుకబడిన దేశాలుగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు లెక్కగడుతాయి. ప్రజలు సొంతంగా ఇళ్లు కొనుక్కోలేక పోతున్నారంటేనే దేశం అభివృద్ధి చెందడం లేదని అర్థం. మూడు కోట్ల ఇళ్లు కట్టిస్తామని మోడీ చేసిన ప్రకటన దేశ దౌర్భాగ్య పరిస్తితులను సూచిస్తోంది. ఈ రంగాల్లో పెట్టుబడి ఖర్చులు ఎక్కువ,ఆదాయం తక్కువ. కావున, ప్రైవేట్ పెట్టుబడులు రావు. ప్రభుత్వ మే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. కానీ 1991 తర్వాత అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు సరిగ్గా ఇందుకు విరుద్ధంగా వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, రైల్వే, రోడ్లు, విమానాశ్ర యాలు, ఓడరేవులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం, విద్య, వైద్య రంగాలతో పాటు కీలకమైన వ్యవసయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాలను గత 25 సంవత్సరాలుగా పాలకులు అమలు చేస్తున్నారు. దీని ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. ఈ విధానాలు పోతేనే దేశం బాగుపడుతుందని గుర్తించాలి.

# వైసిపిలో నివురుగప్పిన అసమ్మతి నిప్పు

**అమరావతి:** వైసిసి నుంచి విజయసాయి నిష్క్రమణ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. రాజకీయాల్లో నిబద్ధత ఉండాలంటూ జగన్ వ్యాఖ్యలు చేశారు. మరో 30 ఏల్లు ఇక తమదే అధికారం అని నమ్మిస్తున్నారు. జగన్‌ను ప్రజలు నమ్ముతున్నారనడానికి మరో నాలుగేళ్లు పడుతుంది. అప్పటికి పరిస్థితితులు ఎలా ఉంటాయన్నది చూడాలి. ఈ లోగా అవినీతి కేసులు వెంటాడుతాయి. కాకినాడ
పోర్టు విషయంలో జరిగిన అక్రమాల కేసులో విజయసాయిరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేసుల వల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేసినట్లుగా క్షేత్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, కష్టకాలంలో విడిచిపోతున్నారని, 'పదవులూ ఆస్తులూ మీకూ, కేసులు మాకా?' అని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అయినా సరే, విజయసాయి రెడ్డి విషయంలో నాయకులనుంచి కార్యకర్తలవరకూ ఎవరూ సానుభూతి ప్రకటించడం లేదు. వైసిపిలో విజయసాయికన్నా ముందే రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఆళ్ల నానీల తర్వాత ఇప్పుడు విజయసాయి రెడ్డి కూడా రాజీనామా చేశారు. ముందు ముగ్గురు రాజీనామాల్లో అంత ప్రత్యేకత ఏమీ లేకపోయినా స్వయం ప్రకటిత జగన్ ఆత్మఅయిన విజయసాయిరెడ్డి రాజీనామా ప్రత్యేకమైనది. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నట్టు ట్వీట్ చేసిన ఆయన, జగన్ కష్టకాలంలో ఉన్నప్పుడు, అది కూడా జగన్ లండన్‌లో ఉన్న సమయంలో హ్యాండ్ ఇచ్చారు. ఇలా ముఖ్యనాయకులు బయటకు వెళ్లిపోవడం వల్ల వైఎస్ఆర్‌సిపి బలహీనపడుతుందా?
ఎవరూ రాజీనామా చేసినా? పోతే పోనీ అన్నట్లుగానే వ్యవహారం ఉంది. వైఎస్ఆర్‌సిపి ఏర్పడి దాదాపు 12 ఏళు కావొస్తున్నా.. ఆ పార్టీకి ఓటర్లు ఉన్నారు కానీ, సంస్థాగత నిర్మాణం సరిగా లేదు. 2024 ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత కూడా అధినేత ఏకపక్ష నిర్ణయాలను మానుకోవడం లేదు. నాయకులు రాజీనామా చేసినప్పుడు సయోధ్య చేసే ప్రయత్నాలు కూడా చేయకపోవడం దీనికి నిదర్శనం. వైఎస్ షర్మిల మొదలుకొని, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, విజయసాయి రెడ్డి లాంటి జగన్ ఆప్తులు బయటకెళ్లడం వల్ల వైఎస్ఆర్‌సిపి పనైపోయిందనుకోవడం అపోహ మాత్రమే. ఆప్తులు బయటకు వెళ్లడం వల్ల జగన్ నైతిక స్థైర్యం దెబ్బతింటుందేమోగానీ, పార్టీ దెబ్బతినే అవకాశం లేదు. ప్రాంతీయ పార్టీలు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న నాయకులే ముసలం సృష్టించే ప్రయత్నం చేస్తారు. 2019లో టిడిపి ఓడగానే ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు సిఎం రమేశ్, సుజనా చౌదరి, టిజి వెంకటేశ్, గరికపాటి మోహన్ రావు రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. వీరు కూడా చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితులుగా పేరుపొందినవారే. వీళ్లు పార్టీనుంచి వేరుపడటంవల్ల టిడిపికి కలిగిన నష్టం సున్నా. అ అటు టిడిపి,
ఇటు వైఎస్ఆర్‌సిపి కేసుల్లో చిక్కుకోవడంవల్ల బిజెపి ప్రాంతీయ పార్టీల భుజం మీద తుపాకీపెట్టి కాలుస్తోంది. 2019 నుంచి 2024 మధ్య వైసిపి భుజం మీద తుపాకీ పెట్టి టిడిపిని కూల్చాలని ప్రయత్నించిన బిజెపి, ఇప్పుడు టిడిపి భుజం మీద తుపాకీ పెట్టి వైఎస్ఆర్‌సిపిని కూల్చే ప్రయత్నం చేస్తోందని చర్చించుకుంటున్నారు.కానీ, బిజెపి, టిడిపి కలిసి వైఎస్ఆర్‌సిపిని అంతం చేయడం కల్లగానే భావించాలి. మాయల ఫకీర్ ప్రాణం పక్షిలో ఉన్నట్టు? వైఎస్ఆర్‌సిపి భవిష్యత్తు కాంగ్రెస్ మీదే ఆధారపడి ఉంటుంది.

# ఉపాధ్యాయులు "సాంకేతిక పరిజ్ఞానం" వినియోగించుకోవాలి.

## - సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 7:**

ప్రతి ఉపాధ్యాయుడు విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించితే విద్యార్థులు పోటీ ప్రపంచానికి దీటుగా ఎదుగుతారని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం, మాణిక్ బండర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన తెలుగు ఉపాధ్యాయుల ఇంటరాక్టివ్ పానెల్ బోర్డ్ సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన అకాడమిక్ మోడరింగ్ ఆఫీసర్ జీవన్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎంఓ జీవన్ మాట్లాడుతూ, సాంకేతికత ఉపాధ్యాయులను బలోపేతం చేస్తుందని అన్నారు. శిక్షణ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించిన ఘనపురం దేవేందర్ ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను ఎలా వినియోగించుకోవాలో, చాక్ పీస్ వాడకుండా ఎలా బోధించాలో, సబ్జెక్టుకి సంబంధించిన ఆడియో వీడియో ఇమేజ్లను ఎలా వాడాలో సమగ్రంగా వివరించారు. మరో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ శివ నాగమణి లర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సులను ఉపయోగించి విద్యార్థులకు ఆసక్తికరంగా ఎలా బోధించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కోర్స్ డైరెక్టర్ భారతి, ఆర్ యుపిపి తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి రమణ చారి, డాక్టర్ గంట్యాల ప్రసాద్, డాక్టర్ కాసర్ల, గోవర్ధన్, గంగాధర్ , గంధం విజయలక్ష్మి, కె సి లింగం, ఆల్గోట్ గంగాధర్, దస్తగిరి, కోకిల నాగరాజు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం.



**హెల్త్ కార్డులపై త్వరలో సమీక్ష.**
**టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ హామీ.**

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్:**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెల్త్ కార్డుల విషయంలో త్వరలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులతో సమీక్ష చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు, జర్నలిస్టుల ఆరోగ్యం విషయంలో రాజీపడేది లేదనీ, అందుకే ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచినట్టు వివరించారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో ఉన్న మంత్రుల నివాస సముదాయంలో శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బృందం మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా హెల్త్ కార్డులు సరిగ్గా పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నా ప్రయివేటు. కార్పొరేట్ ఆసుపత్రులు పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందిస్తున్న కొత్త ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగుల నుంచి వసూలు చేసే ఒక శాతం కంట్రిబ్యూషన్ను జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి ఈ విషయాన్ని పరిశీలిస్తామని ఫెడరేషన్ నాయకత్వానికి హామీ ఇచ్చారు. త్వరలో ఆరోగ్యశ్రీ అధికారులతో జర్నలిస్టుల విషయమై సమీక్ష చేసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు గుడిగ రఘు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి. విజయ, హెచ్ యూజే అధ్యక్షులు బి. అరుణ్ కుమార్, బి. జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి.

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**
**ఉప్పల్ వాయి సాంఘీక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఫిబ్రవరి 7:**





విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రాత్రి రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల ను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా తొలుత 10 వ తరగతి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. రోజువారి కార్యక్రమలు చదువు, ఆటలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఫిజికల్ ఫిట్నెస్, భోజనం ఎలా వుంది, సౌకర్యాలపై ఆరా తీశారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని వంద శాతం రిజల్ట్ రావాలని తెలిపారు. అనంతరం తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్, స్టోర్ రూం లను పరిశీలించి ప్రతీ రోజు కిచన్ గదులను శుభ్ర పరచాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, ప్రిన్సిపాల్ శివరాం, జోనల్ ఆఫీసర్ పూర్ణ చందర్, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీఓ తిరుపతి రెడ్డి,

మండల విద్యాధికారి ఆనంద్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలి.

## - ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి పిలుపు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఫిబ్రవరి 7:**

ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. గెలుపు కోసం కాషాయ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా దేవునిపల్లి గ్రామానికి చెందిన నీలం చిన్న రాజులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి బాణాల లక్ష్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలను పెంచాలి.

## - హెచ్.ఎంల సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హితవు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 07**

: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి, ఉపాధ్యాయ వృత్తికి సార్ధకత చేకూర్చినవారవుతారని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మీటింగ్ హాల్ లో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎం.ఈ.ఓ లతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై కలెక్టర్ వారికి దిశా నిర్దేశం చేశారు. మార్కులు, గ్రేడ్ పాయింట్లు ప్రామాణికం కాకుండా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని అన్నారు. ప్రతి విద్యార్థికి సామాజిక పరిస్థితులపై చక్కటి అవగాహన కల్పిస్తూ, ఇష్టపడి చదువుకోవాలనే కోరికను వారిలో పెంపొందించాలన్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థిని తమ కన్న బిడ్డలుగానే భావిస్తూ, వారికి నాణ్యమైన విద్యను అందించి భావి జీవితానికి మార్గనిర్దేశకులుగా మారాలని పిలుపునిచ్చారు. బడులలో ప్రభుత్వ పరంగా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని, ఈ దిశగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయని, ప్రభుత్వం నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తోందని గుర్తు చేశారు. అయితే విద్యా బోధన సక్రమంగా లేకపోతే మౌలిక వస్తులు, ఇతర సదుపాయాల కోసం ఎన్ని కోట్ల రూపాయల నిధులు వెచ్చించిన ప్రయోజనం ఉండదని అన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపించిన దృష్ట్యా, ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తూ సిలబస్ ను పూర్తి చేయాలన్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో తానూ ఆయా పాఠశాలలను తనిఖీ చేసిన సందర్భంలో అనేక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించినప్పుడు విద్యా ప్రమాణాలు సంతృప్తికరంగా కనిపించలేదని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.



పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా కాకుండా విద్యార్థులకు పునఃశ్చరణ జరిపించాలని, చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునే ప్రోత్సహిస్తూ, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అపార్ ఐ.డీలు జనరేట్ చేయడంలో ముందంజలో నిలిచిన ఐదుగురు హెచ్.ఎం లను, ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఐదుగురు కాంప్లెక్స్ పాఠశాలల హెచ్.ఎంలను కలెక్టర్ సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, పరీక్షల నియంత్రణ విభాగం అధికారి విజయభాస్కర్, ఎం.ఈ.లు, హెచ్.ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం.

## - అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 7:**

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం అని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త హెచ్చరించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వం కులగణన గొప్పగా చేసాము, మా అంత గొప్ప పార్టీ, గొప్ప నాయకులు దేశంలో ఎవరు లేరన్నట్లు అసెంబ్లీ లో తీర్మానం పెడుతున్నాం అని బీసీ వర్గం ప్రజలను మోసం చేసే కుట్ర అసెంబ్లీలో జరిగిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ చేసిన పెద్ద డ్రామా అని, గత ప్రభుత్వం లెక్కల ప్రకారం 1.85 కోట్ల పైగ అంటే 51శాతం బీసీలు ఉంటే ఇప్పుడు కాంగ్రెస్ లెక్కల ప్రకారం 1.65 కోట్లు అంటే 46.25 శాతం కు తగ్గిందని, మరి దాదాపు 21 లక్షల బీసీలు ఏమైనారు అని ప్రశ్నించారు. 10 ఏళ్ల నుండి బీసీలు ఏమైనా అంతరించిపోతున్న వర్గంగా ప్రభుత్వం భావిస్తుందా ప్రశ్నించారు. దీని వల్ల లక్షల బీసీ కుటుంబాలు తమ రిజర్వేషన్ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అసలు ఈ బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ఒక పెద్ద కుట్ర చేయబోతుందని అది అందరు గమనించాలన్నారు. 10.8 శాతం బీసీ ముస్లిం అని, వారిని బీసీలో కలిపే కుట్రకు కాంగ్రెస్ పునుకుందన్నారు. కాంగ్రెస్ నాయకులు బీసీ బిడ్డలకు ఈవిదంగా అన్యాయం చేస్తా అంటే చూస్తూ ఊరుకోమని అన్నారు.హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అనేది ఉంటుందా%%? ముఖ్యమంత్రి రేవంత్, మంత్రివర్గం మతిలేని చేష్టలు చేస్తూ తెలంగాణ బిడ్డలను మోసం చేస్తున్నారని అన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ తీర్మానం చేసినం, కేంద్రం అమోదించాలి అంటే అడ్డమైన తీర్మానాలు చేసి కేంద్రానికి పంపితే కేంద్రం ఎందుకు అమోదిస్తుందని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి, దానికి మేము వ్యతిరేకం కాదని కానీ బీసీ కులగనన పేరుతో మైనారిటీ వర్గాన్ని బీసీలో కలిపే కుట్ర చేసినట్లు మాకు అనుమానం వస్తుందని ముందు ప్రభుత్వం దాన్ని స్పష్టం చేయాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన ఓ తప్పుల తడక అనడానికి ఆ పార్టీ ఎమ్మెల్సీ ఆ రిపోర్ట్ ను తగలబెట్టడమే అందుకు నిదర్శనం అన్నారు. తూ తూ మంత్రాంగ నిర్వహించిన సర్వే కాకుండా నిజమైన బీసీల లెక్కలు తేల్చలని డిమాండ్ చేసారు.కాంగ్రెస్ కు బీసీ బిడ్డల పైన నిజంగా చిత్త శుద్ధి ఉంటే మంత్రి వర్గంలో బీసీలకు ఎందుకు సమూచిత న్యాయం కల్పించలేకపోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు ఏమైనాయో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని 15 వ పేజీలో హామీ ఇచ్చిన విధంగా, ఐదేళ్లలో బీసీల సంక్షేమ కోసం సంవత్సరానికి 20 వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలలో లక్ష కోట్లు ఖర్చుపెడతామని హామీ ఇచ్చారు. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేవలం 8 వేల కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్లో కేటాయించనందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.నిజంగానే బీసీలపై ప్రేమ ఉంటే రాబోయే బడ్జెట్ లో ఇచ్చిన హామీ ప్రకారం 20వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. మహాత్మా జ్యోతిరావు పులే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు హామీ ఎందుకు నెరవేర్చలేదన్నారు. కనీసం మొన్న జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో సబ్ ప్లాన్ అయినా ఏర్పాటు చేస్తారు అంటే అది లేకపోయే అని విమర్శించారు. బీసీ యువత ఉన్నత విద్య, ఉపాధికి వడ్డీలేని 10 లక్షల రుణాల ఊసే లేకపోయే అన్నారు. అంతే కాకుండా మూడు లక్షల రూపాయల ఆదాయమున్న ప్రతి బీసీ కుటుంబానికి పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ ఇస్తా అన్న హామీ ఏమైందన్నారు. ఇప్పటివరకు 6వేల కోట్ల బకాయితొ బీసీ బిడ్డలను చదువుకు దూరం చేసే కుట్ర తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు చేసింది ఏమి లేదని మండిపడ్డారు. బీసీ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేసి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

**ప్రతి మండలంలో ఒక గురుకులం అన్నారు. దాని పురోగతి ఏంటో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.**

ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ గురుకుల డిగ్రీ కాలేజ్ అన్నారు.. సంవత్సరం గడిచిన వాటి ఊసే లేదన్నారు. బీసీలకు 10 లక్షల వడ్డీ లేని రుణమిస్తా అని చెప్పారని, ఒక్క బీసీ బిడ్డకు అయినా రుణం ఇచ్చారా ? ఒకవేళ ఇస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో 50 కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్కదానికైనా కనీసం శంకుస్థాపన చేసారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో 2వ దశ గొర్ల పంపిణీ ఏమైందన్నారు. గౌడన్నలకు 5 ఎకరాలు భూమి ఈత వనాల కోసం ఇస్తామన్నారు, ఎంతమంది గౌడ అన్నలకు ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రిజర్వేషన్ అంశంతో రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారు తప్ప నిజంగా చిత్తశుద్ధి అంతే బీసీలకు ఇచ్చిన హామీలు అన్ని అమలుచేసి ప్రజాక్షేత్రంలో ఓట్లు అడగాలని డిమాండ్ చేసారు. బీసీలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చకుంటే రేవంత్ సర్కార్ ను బీసీ బిడ్డలు కూల్చడం ఖాయం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# యూజిసి ముసాయిదాను ఉపసంహరించుకోవాలి.

## - పిడిఎస్ యూ ఆద్వర్యంలో తేయూ రిజిస్టర్ ద్వారా గవర్నర్ (ఛాన్సలర్)కు లేఖ.




**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, ఫిబ్రవరి 7:**

ఫెడరల్ స్పూర్తి కి విరుద్ధంగా, రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా కొత్తగా తయారు చేసిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యుజిసి ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని గవర్నర్ ( ఛాన్సలర్)కి తేయూ రిజిష్టర్ ద్వారా లేఖను పిడిఎస్ యూ ఆద్వర్యంలో అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలను కార్పోటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతనంగా యూజీసీ లో కొత్తగా నిబంధనలను తీసుకువచ్చారని, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని మేం కోరుకుంటున్నామని, యూజీసీ నిధులు యూనివర్సిటీల అభివృద్ధికి గత కొంతకాలంగా విడుదల చేయడం లేదని, యూనివర్సిటీలకు యూజీసీ ద్వారా నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్రల పరిధిలో ఉన్న యూనివర్సిటీలలో కేంద్రం పెత్తనం చెల్లించడానికి కుట్రలు పన్నుతోందని , పారిశ్రామికవేత్తలను, తమ భావజాలానికి అనుకూలంగా ఉండే వారిని వీసీలుగా నియమించడానికి సవరణలు చేస్తున్నారని అన్నారు. వైస్ ఛాన్సర్లు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కాంట్రాక్టు ప్రొఫెసర్ల ప్రస్తుత నియామక అర్హతలు కొనసాగించాలని ,

పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం యూజిసి లో తమ అనుకూల విధానాలను విద్యలో ప్రవేశపెడుతున్నారని,

యూనివర్సిటీల పీహెచ్డీ ప్రవేశాలలో సెట్, నెట్ లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే నూతనంగా తీసుకువచ్చిన యూజీసీ నిబంధనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తే. యూ నాయకులు ప్రిన్స్, దేవిక, అక్షయ్, రాకేష్, హుస్సేన్, రోహిత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు .

వేగుచుక్క

# విజయ్ దేవరకొండ సినిమా చేయడం నా కూతురికి ఇష్టం లేదు..



విజయ్ దేవరకొండ, అనన్య పాండే జంటగా నటించిన సినిమా 'లైగర్'. ఈ చిత్రంతో విజయ్ బాలీవుడ్ కు వెళ్తే, అనన్య టాలీవుడ్ లో అడుగుపెట్టింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో మైక్ టైసన్, రమ్యకృష్ణ, రోనీత్ రాయ్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాలతో వచ్చిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అందరినీ డిజప్పాయింట్ చేసింది. అనన్యకు మళ్ళీ తెలుగులో ఆఫర్స్ లేకుండా చేసింది. అయితే తన కుమార్తె అసౌకర్యంగానే ఈ మూవీ చేయడానికి ఓకే చెప్పిందని ఆమె తండ్రి షాకింగ్ కామెంట్స్ చేసారు.

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్ లో వచ్చిన సినిమా 'లైగర్'. బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే ఈ మూవీతోనే టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. 2022లో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరి కెరీర్ లో భారీ పరాజయంగా మిగిలిపోయింది. అయితే ఈ సినిమాపై బాలీవుడ్ సీనియర్ నటుడు చంకీ పాండే కీలక వ్యాఖ్యలు చేశారు. అనన్యకు ఈ చిత్రంలో నటించడం ఇష్టం లేదని, అసౌకర్యంగానే ఒప్పుకుందని తెలిపారు.

చంకీ పాండే కూతురే అనన్య పాండే అనే సంగతి తెలిసిందే. హిందీ సినిమాల్లో హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన ఈ బ్యూటీ.. 'లైగర్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తాజాగా ఈ చిత్రం గురించి చంకీ పాండే మాట్లాడుతూ.. "అనన్యకు ఈ సినిమా ఆఫర్ వచ్చినప్పుడు అసౌకర్యంగా ఫీలైంది. ఆ పాత్రకు తాను సెట్ కానని, చిన్న పిల్లలా కనిపిస్తానని భావించింది. కన్ఫ్యూజన్ లో ఉండిపోయింది. నా దగ్గరకు వచ్చి 'పాపా.. ఈ పాత్ర చేయడానికి నేను చాలా చిన్నదాన్ని' అని చెప్పింది. కానీ ఈ సినిమా చేయమని నేను చెప్పాను. ఇది పెద్ద కమర్షియల్ సినిమా అని, సక్సెస్ అయితే మంచి పేరొస్తుందని ఒప్పించాను" అని తెలిపారు.

'లైగర్' సినిమా రిలీజయ్యాక వచ్చిన రివ్యూలు చూసి తన కుమార్తె చెప్పింది నిజమేనని అనిపించిందని.. నిజంగానే ఆ పాత్రకు అనన్య చాలా యంగ్‌గా ఉందనే ఫీలింగ్ వచ్చిందని చంకీ పాండే అన్నారు. ఆ తర్వాత ఫలానా సినిమా చేయమని ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని.. ఇప్పుడు స్క్రిప్ట్ విషయంలో పూర్తి నిర్ణయం తనదేనని చెప్పారు. ప్రజంట్ తనకు నచ్చిన సినిమాలు సెలెక్ట్ చేసుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతోందని చంకీ పాండే చెప్పుకొచ్చారు. గతంలో అనన్య సైతం 'లైగర్' గురించి మాట్లాడుతూ.. కరణ్ జోహార్, తన తల్లిదండ్రులు చెప్పడం వల్లనే ఈ సినిమా చేసానని చెప్పింది. 'లైగర్' చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, కరణ్ జోహార్ దీనికి నిర్మాతలు. పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ సినిమా ఏ దశలోనూ ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఇందులో నత్తితో మాట్లాడే మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ గా విజయ్ దేవరకొండ కనిపించారు. ప్రపంచ ప్రఖ్యాత బాక్సర్ మైక్ టైసన్ కూడా తీసుకొచ్చారు. కానీ కథలో విషయం లేకపోవడం, టేకింగ్ లో కొత్తదనం లేకపోవంతో బాక్సాఫీస్ దగ్గర తేడా కొట్టింది. సినిమా అట్టర్ ఫ్లాప్ అవ్వడంతో అనన్య పాండేకి తెలుగులో మళ్ళీ అవకాశాలు రాలేదు.

# భార్య నటించిన బోల్డ్ వెబ్ సిరీస్ నచ్చిందంటున్న నాగచైతన్య



యువసామ్రాట్ నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన 'తండేల్' సినిమా ఫిబ్రవరి 7వ తేదీన థియటర్లలో విడుదల కానుంది. చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మించారు. అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పించారు. ఈ సినిమాపై అభిమానుల్లో, ట్రేడ్ లో మంచి అంచనాలున్నాయి. శోభితను పెళ్లి చేసుకున్న తర్వాత తన నుంచి వస్తోన్న సినిమా కావడంతో చైతూ ప్రత్యేకంగా భావిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన భార్య గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

అక్కినేని నాగచైతన్య నటించిన 'తండేల్' సినిమా మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రానికి మంచి బజ్ క్రియేట్ అయింది. కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుందని చైతూ చాలా ధీమాగా ఉన్నారు. ఇక ప్రమోషన్స్ లో భాగంగా వరుసగా ఇంటర్వ్యూ ఇస్తున్న యువసామ్రాట్.. ఎక్కడికి వెళ్లినా తన సతీమణి శోభితా దూళిపాళ్ల గురించి మాట్లాడుతూ వస్తున్నారు. తన వైవాహిక జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. శోభిత నటించిన వాటిల్లో తన ఫేవరేట్ సినిమాలను చైతన్య తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు.

శోభిత నటించిన 'మేడ్ ఇన్ హెవెన్' వెబ్ సిరీస్.. 'మేజర్' సినిమాలు అంటే తనకు ఎంతో ఇష్టమని నాగచైతన్య తెలిపారు. వాటిల్లో తన భార్య చాలా బాగా యాక్ట్ చేసిందని పేర్కొన్నారు. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితం ఆధారంగా అడవి శేష్ హీరోగా తెరకెక్కిన 'మేజర్' మూవీలో శోభిత కీలక పాత్ర పోషించింది. రియల్ లైఫ్ పాత్ర స్ఫూర్తితో రాసుకున్న ప్రమోద రెడ్డి అనే క్యారక్టర్ లో మంచి పెర్ఫార్మన్స్ చూపించింది. ఇందులో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి. హీరో మహేష్ బాబు సొంత ప్రొడక్షన్ లో రూపొందిన ఈ చిత్రం.. 2022లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్టయింది. అలానే 2019లో శోభితా దూళిపాళ్ల నటించిన 'మేడ్ ఇన్ హెవెన్' సిరీస్ మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. దీంట్లో బాలీవుడ్ యాక్టర్ జిమ్ సరభ్ తో కలిసి కొన్ని బోల్డ్ సన్నివేశాల్లోనూ నటించింది. నాగచైతన్యను వివాహం చేసుకున్న తర్వాత యాంటీ ఫ్యాన్స్ ఎక్కువగా ఈ వీడియో క్లిప్పింగ్స్ నే సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసారు. అయితే అలాంటి వెబ్ సిరీస్ తనకు బాగా నచ్చిందని, అందులో శోభిత యాక్టింగ్ బాగుందని చైతూ చెబుతున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. లాస్ట్ ఇయర్ వచ్చిన సీజన్-2 కు కూడా ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. సమంతతో విడిపోయిన తర్వాత కొన్నాళ్ళు ఒంటరి జీవితాన్ని గడిపిన నాగచైతన్య.. ఆ తర్వాత శోభితతో ఫ్రెండ్ షిప్ చేసారు. ఇద్దరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో, గతేడాది డిసెంబర్ నెలలో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. ఇప్పటికే వీరిద్దరూ తమ లవ్ స్టోరీ గురించి పలు సందర్భాల్లో మాట్లాడారు. ఇక చైతూ 'తండేల్' ప్రమోషన్స్ లో తన అర్ధాంగిపై ఇష్టాన్ని బయటపెడుతూ వస్తున్నారు. శోభితను ప్రేమగా బుజ్జితల్లి అని పిలుస్తానని ప్రీరిలీజ్ ఈవెంట్ లో చెప్పారు.



నాగ చైతన్య-సాయి పల్లవి జంటగా నటించిన తండేల్ చిత్రం రేపు (ఫిబ్రవరి 7) రిలీజ్ కాబోతుంది. ఇప్పటికే సినిమా ప్రమోషన్స్ గట్టిగానే చేసింది మూవీ టీమ్. ఓ మంచి లవ్ స్టోరీ అంటూ బజ్ కూడా బాగానే ఉంది. ఇక ఈ సినిమా విజయంపై టీమ్ అయితే చాలా నమ్మకంగా ఉంది. దేవిశ్రీ ప్రసాద్, డైరెక్టర్ చందు మొండేటి అయితే రిలీజ్‌కి ముందే సంబరాలు మొదలుపెట్టేశారు.

అక్కినేని నాగ చైతన్య కెరీర్‌లోనే భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందింది తండేల్. చందు మొండేటి తెరకెక్కించిన ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించింది. దేశభక్తితో పాటు ఓ మంచి లవ్ స్టోరీగా తండేల్ తీసినట్లు మూవీ టీమ్ చెబుతుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్, పాటలకి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా బుజ్జితల్లి, హైలెస్సో హెలస్సా పాటలు అయితే రిపీట్ మోడ్‌లో మోగుతున్నాయి.



## దేవిశ్రీ ప్రసాద్ డ్యాన్స్

ఇలాంటి వేళ రిలీజ్‌కి ముందే సంబరాలు మొదలుపెట్టేసింది మూవీ టీమ్. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్, డైరెక్టర్ చందు మొండేటి మిక్సింగ్ థియేటర్లో స్టెప్పులేస్తున్న వీడియో బయటికొచ్చింది. "వస్తున్నాం దుల్లగొడుతున్నాం".. అంటూ తాజాగా గీతా ఆర్ట్స్ ఓ వీడియో పోస్ట్ చేసింది. ఇందులో హైలెస్సో హెలస్సా పాట చూసి సడెన్‌గా దేవిశ్రీ స్టెప్పులు వేయడం మొదలుపెట్టారు. ఇక దేవితో కలిసి చందు మొండేటి కూడా డ్యాన్స్ ఇరగదీశారు. స్క్రీన్ మీద సాయి పల్లవి చేసిన డ్యాన్స్‌ని చూసి అలానే డీఎస్పీ స్టెప్పులు వేయడం క్యూట్‌గా ఉంది. ఈ వీడియో చూసి ఫ్యాన్స్ తెగ కామెంట్లు పెడుతున్నారు. సినిమా సూపర్ హిట్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కి దొరికిపోయిన భారత జాలర్ల కథే తండేల్. ఇందులో ఓ మంచి లవ్ స్టోరీని కలిపారు. ఈ సినిమాలో తండేల్ రాజు పాత్రలో నాగ చైతన్య నటిస్తు న్నారు. సత్య (బుజ్జితల్లి)గా సాయి పల్లవి కనిపించబోతున్నారు. ఇప్పటికే వీరి కాంబోలో వచ్చిన లవ్ స్టోరీ చిత్రం సూపర్ హిట్ అయింది. ఇప్పుడు మళ్లీ అదే కాంబోలో బ్లాక్ బస్టర్ కొడుతున్నామంటూ అక్కినేని ఫ్యాన్స్ అంటున్నారు. సాయి పల్లవి రీసెంట్‌గా అమరన్ చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఈ సినిమాలో ఆమె నటనకి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ మరో స్ట్రాంగ్ క్యారెక్టర్‌తో సాయి పల్లవి ఆడియన్స్‌ని పలకరిస్తుంది. ఇక నాగ చైతన్యకి కూడా సరైన హిట్ పడి చాలా కాలం అయిపోయింది. ఈ సినిమాతో ఆ హిట్టు దక్కుతుందని చైతూ ఆశగా ఉన్నారు.

# ఇంత దారుణం ఏంటో మోనాలిసా...

ప్రయాగ్‌రాజ్‌లో పూసల దండలు అమ్ముకునే మోనాలిసాను సోషల్ మీడియా ప్రపంచానికి పరిచయం చేసింది. ఆమె అందానికి జనాలు ఫిదా అవ్వడంతో.. ఇప్పుడు ఏకంగా బాలీవుడ్‌లో సినిమా చేసే అవకాశం ఆమెకు లభించింది. అయితే మోనాలిసాకు సంబంధించిన రోజుకో ఫేక్ పోస్టు బయటకు వస్తోంది. 16 ఏళ్ల మోనాలిసా 60 ఏళ్లకు దగ్గరున్న సల్మాన్ ఖాన్‌ను పెళ్లాడినట్లు సోషల్ మీడియాలో ఓ పోస్టు కనిపించింది. ఇది ఏఐ ద్వారా క్రియేట్ చేసిందని సజగ్ తేల్చింది.

మహా కుంభ మేళాలో పూసల దండలు అమ్ముతూ వెలుగులోకి వచ్చిన మోనాలిసా ఇప్పుడు సెలబ్రిటీగా మారిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా అందరికీ తెలిసిన ఆమె.. త్వరలోనే సినిమాల్లో నటించనుంది. మోనాలిసాకు సంబంధించి నిత్యం వార్తలు బయటకు వస్తూనే ఉన్నాయి. అయితే ఇదే సమయంలో కొన్ని ఫేక్ పోస్టులు కూడా సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. మోనాలిసా న్యూ లుక్ అంటూ ఈ మధ్యే ఓ పోస్టు వైరల్ కాగా.. తాజాగా మరో పోస్టు వైరల్ అవుతోంది. అదేంటో చూద్దాం..




'సల్మాన్ ఖాన్ పెళ్లి చేసుకున్నాడు - పాట్నాలో' అని అర్థం వచ్చే హిందీ క్యాప్షన్‌తో సల్మాన్ ఖాన్, మోనాలిసా వధూవరుల వస్త్రధారణలో ఉన్న ఫొటోను నేహా ఖాన్ రియాక్షన్ అనే ఫేస్‌బుక్ పేజీలో ఫిబ్రవరి 4న పోస్టు చేశారు. ఈ ఫొటోను 1.8 వేల మంది లైక్ చేయగా.. 134 కామెంట్లు వచ్చాయి. వైరల్ అవుతోన్న ఈ ఫొటో నిజమేనా అని తేల్చడం కోసం



సజగ్ టీమ్ గూగుల్‌లో మోనాలిసా అని సెర్చ్ చేయగా.. ఆమె పెళ్లికి సంబంధించి ఎలాంటి కథనాలు కనిపించలేదు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన మోనాలిసా భోంస్లే వయసు 16 సంవత్సరాలేనని మీడియా కథనాల్లో కనిపించింది. ఇండియాలో అమ్మాయిల పెళ్లి వయసు 21 ఏళ్లు కావడంతో.. 16 ఏళ్ల మోనాలిసా అప్పుడే పెళ్లి చేసుకుంటుందని అనుకోలేం. అంతే కాకుండా సల్మాన్ ఖాన్ వయసు కూడా 59 ఏళ్లు. దీంతో మోనాలిసాకు సంబంధించి అనేక ఫేక్ ఫొటోలు, ఏఐతో రూపొందించిన ఫోటోలు ఇటీవలి కాలంలో బయటకు రావడంతో సజగ్ ఇది కూడా ఫేక్ అయ్యి ఉంటుందని భావించింది. హైవ్ మోడరేషన్ టూల్ ద్వారా ఇది ఏఐతో రూపొందించిన ఇమేజ్ అవునో కాదో అని పరీక్షించగా.. 99.9 శాతం ఇది ఏఐ సాయంతో రూపొందించిన ఫొటో లేదా డీప్ ఫేక్ ఫొటో అని తేలింది.

ఫేక్ ఇమేజ్ డిటెక్టర్ అనే టూల్ సైతం ఇది కంప్యూటర్ జనరేటెడ్ లేదా మాడిఫైడ్ ఇమేజ్ అని అంచనా వేసింది. దీంతో వైరల్ అవుతోన్న సల్మాన్-మోనాలిసా పెళ్లి ఫొటో ఫేక్ అని సజగ్ టీమ్ నిర్ధారించింది.

ఫేస్ బుక్ పేజీలో పోస్టు చేసిన సల్మాన్ పెళ్లి ఫొటో ఫేక్. ఏఐ ద్వారా రూపొందించిన ఫొటోను ఇలా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సల్మాన్ ఖాన్ పెళ్లి చేసుకుంటే అది అతి పెద్ద అవుతుంది. కానీ మీడియాలో ఎక్కడా దీనికి సంబంధించిన కథనాలు కనిపించలేదు. దీంతో ఇది ఫేక్ పోస్టు అని సజగ్ టీమ్ తేల్చింది.



బాలీవుడ్‌లో కపూర్ ఫ్యామిలీ ఎంత పెద్దదో అందరికీ తెలిసిందే. తరాలు గడుస్తున్నా ఆ ఫ్యామిలీ ప్రభావం బాలీవుడ్‌పై నడుస్తూనే ఉంది. ఆ కపూర్ ఫ్యామిలీలో ఒకరే అర్జున్ కపూర్. బాలీవుడ్ స్టార్ నిర్మాత బోనీ కపూర్ కుమారుడే అర్జున్. ఇప్పటివరకూ ఎన్నో సినిమాల్లో హీరోగా నటించాడు అర్జున్. కానీ సరైన హిట్ మాత్రం పడలేదు. దీంతో అర్జున్‌పై సోషల్ మీడియాలో ట్రోల్స్‌కి కొదవ లేదు. తాజాగా అర్జున్‌కి సంబంధించిన ఓ వీడియో వైరల్ అవుతోంది.

జాన్వీ కపూర్‌కి చెల్లెలితో పాటు ఓ అన్నయ్య కూడా ఉన్నాడన్న సంగతి చాలా తక్కువ మందికి తెలుసు. అతని పేరే అర్జున్ కపూర్. అయితే డైరెక్ట్‌గా అన్నయ్య కాదు.. స్టెప్ బ్రదర్ అన్నమాట. అంటే జాన్వీ తండ్రి బోనీ కపూర్ మొదటి భార్య సంతానం అర్జున్ కపూర్. పేరుకి సవతి తల్లి కూతుళ్లు అయినా కూడా జాన్వీ, ఖుషీ ఇద్దరినీ చాలా ప్రేమగా చూసుకుంటాడు అర్జున్. రక్షా బంధన్ నుంచి ఏ పండగ వచ్చినా సరే వీళ్లతో కలిసే జరుపుకుంటాడు.

అయితే ఫ్యామిలీ లైఫ్ పక్కన పెడితే కెరీర్ పరంగా మాత్రం అర్జున్‌కి చాలా బ్యాడ్ టైమ్ నడుస్తోంది. ఎంతలా అంటే ఏ సినిమా చేసినా హిట్టు మాట పక్కన పెడితే భారీ డిజాస్టర్లు అవుతున్నాయి. మొన్నా మధ్య అయితే అర్జున్ కపూర్ నటించిన 'ది లేడీ కిల్లర్' చిత్రం కలెక్షన్ల పరంగా ఇండియన్ సినిమా చరిత్రలోనే ది వరస్ట్ మూవీగా రికార్డు సృష్టించింది. కనీసం రూ.70 వేల కలెక్షన్లు కూడా ఈ సినిమా

## ముఖం మీదే తలుపేసిన జాన్వీ..

రాబట్టలేకపోయింది. దీంతో అర్జున్‌పై సోషల్ మీడియాలో తెగ ట్రోల్స్ వస్తుంటాయి. అయినా కూడా తన పని తాను చేసుకుంటూ విమర్శలని కూడా గౌరవంగా తీసుకుంటాడు అర్జున్.

ఇక తాజాగా అర్జున్‌కి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో జాన్వీ కపూర్ తన బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహాడియాతో కలిసి ఇంట్లోకి వెళ్లింది. అయితే డోర్ దగ్గర అర్జున్ కపూర్ ఉన్నా వాళ్లిద్దరూ పట్టించుకోకుండా లోపలికి వెళ్లిపోయారు. ఆ వెంటనే డోర్ క్లోజ్ అయింది. ఆ సమయంలో అర్జున్ ఫొటోలకి పోజులిస్తున్నాడు. ఆ వెంటనే వెనక్కి తిరిగి చూసేసరికి డోర్ క్లోజ్ అయి ఉంది. దీంతో కాలింగ్ బెల్ కొట్టి డోర్ ఓపెన్ అయ్యాక అర్జున్ లోపలికి వెళ్లాడు. సింపుల్‌గా వీడియో ఉన్నది ఇదే. అయితే ఈ వీడియోని షేర్ చేస్తూ కొంతమంది నెటిజన్లు అర్జున్‌ని ట్రోల్ చేస్తున్నారు. ఆడియన్స్ మాత్రమే కాదు ఇంట్లో వాళ్లు కూడా అర్జున్‌ని పట్టించుకోవడం లేదు అంటూ కామెంట్లు చేస్తున్నారు. కానీ కొంతమంది మాత్రం అర్జున్‌కి సపోర్ట్ చేస్తూ మాట్లాడుతున్నారు. ఆ వీడియోలో జాన్వీ డోర్ క్లోజ్ చేయలేదని అది ఆటోమేటిక్ డోర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇక వీడియో విషయానికొస్తే ఇది గతేడాది నవంబర్‌లో జరిగిన ఘటనగా తెలుస్తోంది. ఈ పాత వీడియోని ఇప్పుడు మళ్లీ సోషల్ మీడియాలో షేర్ చేసి మరీ అర్జున్‌ని ట్రోల్ చేస్తున్నారు. ఇక అర్జున్.. బాలీవుడ్ ఐటెం బాంబ్ మలైకా అరోరాతో మొన్నటివరకూ రిలేషన్‌లో ఉన్నారు.